సాధారణంగా ప్రభుత్వానికి అనుకూలంగా అధికారులు పనిచేస్తూ ఉంటారు. కానీ, వైసీపీ ఐదేళ్ల హయాంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులే కాదు నాయకులు ఏం చెప్పినా అధికారులు తలలూపారు. కొందరైతే వీరభక్తుల్లా పనిచేశారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చినా వీళ్లంతా మారకపోవడంతో.. పాత వాసనలతోనే పనిచేస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధులంటే లెక్కలేనితనంతో వ్యవహరిస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

మారింది అధికారమే.. అధికారులు కాదు!

- ఎమ్మెల్యేలను లెక్క చేయని వైనం
- అన్ని స్థాయిల్లోనూ అవమానాలే
- ఏ పనీ చేయలేక ప్రజాప్రతినిధుల సతమతం





వైసీపీ పాలనలో..

ఎస్‌ఐ, తహసీల్దారు వంటి మండలస్థాయి అధికారుల్ని ఎమ్మెల్యేలు వద్దనుకుంటే రాత్రికి రాత్రే మార్చేశారు. సోమలలో డీటీ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఐదేళ్ల పాటు ఇన్‌చార్జి తహసీల్దారుగా ఒకే చోట పెట్టుకోగలిగారు. ఇలా తమకు కావాల్సినవారిని కొనసాగించారు. ఏ మాత్రం అర్హత లేని ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డిని జడ్పీ సీఈవో కుర్చీలో ఏళ్లపాటు కూర్చోబెట్టారు. ఓ సాధారణ స్కూల్ టీచర్ చిన్నారెడ్డికి మైనార్టీ సంక్షేమాధికారి కుర్చీ అప్పగించారు. అన్ని స్థాయిలోనూ ఒకే సామాజిక వర్గానికి చెందిన అధికారుల్ని పెట్టుకోగలిగారు. అధికారులు కూడా నిబంధనల్ని పట్టించుకోకుండా వైసీపీ నాయకుల ఇంట్లో మనుషుల్లా వ్యవహరించారు.

ఎమ్మెల్యేను లెక్కచేయని తహసీల్దార్

ఇటీవల పెనుమూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే థామస్ విద్యాకిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సుభద్ర ఆలస్యంగా వచ్చారు. పట్టించుకోని థామస్.. 430 సర్వే నెంబరులో వైసీపీ నాయకులు చేసిన భూఅక్రమాల వివరాల గురించి ఆమెను అడిగారు. ఆమె సరైన సమాధానం చెప్పకపోగా.. నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఎమ్మెల్యేతో పాటు చుట్టూ ఉన్న వారంతా ఆమె తీరుతో ఆశ్చర్యపోయారు. ఎవరు ఎంత ఆగ్రహించినా ఆమె లెక్కచేయకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. కలికిరి గ్రామ రైతు సమస్యను ఎందుకు పరిష్కరించలేదని అడిగినా ఆమె సమాధానమివ్వలేదు. గతంలో ఓ రేషన్ డీలర్ తూకంలో చేస్తున్న మోసాల గురించి ఫిర్యాదు చేసినా ఆమె చర్యలు తీసుకోలేదు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక..

ఏ స్థాయిలోనూ అధికారులు ఎమ్మెల్యేల మాట వినడం లేదు. ఇన్నాళ్లు నిబంధనలు గుర్తురాని అధికారులంతా ఇప్పుడు మాటకు ముందు.. మాటకు తర్వాత నిబంధనలంటూ పనులు చేయడం లేదు. దీంతో తమ అనుచరులు, పార్టీ కార్యకర్తలు అడిగిన చిన్నపాటి పనుల్ని కూడా చేయలేక ఎమ్మెల్యేలు అవమానపడుతున్నారు. వైసీపీలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన అధికారులు అందలమెక్కితే.. ఇప్పుడు కమ్మ సామాజిక వర్గానికి చెందిన బిక్కు బిక్కుమంటున్నారు. జిల్లాలో ఏ ఎమ్మెల్యే కూడా కమ్మ అధికారులకు లెటర్లు ఇవ్వాలంటే వెనుకడుగు వేస్తున్నారు. ఉదాహరణకు కమ్మ సామాజికవర్గానికి చెందిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్.. తన పరిధిలోని ఏ శాఖలోనూ కీలక స్థానంలో కమ్మ అధికారులు లేకుండా చూసుకుంటున్నారు.

ఎమ్మెల్యే సిఫార్సు తెచ్చారని డీఈవో షోకాజ్

ఇటీవల పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ బంగారుపాళ్యం హైస్కూల్‌లో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. 'డీఈవో నా డిప్యుటేషన్‌ను అకారణంగా రద్దు చేసి, అవహేళనగా మాట్లాడారు. గంటల వ్యవధిలో జాయిన్ కాకుండా ఎస్‌ఆర్‌లో క్రమశిక్షణ తప్పినట్లు నమోదు చేస్తానని బెదిరించారు' అని అక్కడి ఓ మహిళా ఉద్యోగి ఎమ్మెల్యేతో చెప్పి కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో ఆమె రాసుకున్న అర్జీ మీద 'ప్లీజ్ కన్సిడర్ హర్ రిక్వెస్ట్ ఆన్ హ్యూమానిటీ గ్రౌండ్స్' అని ఎమ్మెల్యే రాసి పంపించారు. దాన్ని తీసుకుని పాఠశాల హెచ్‌ఎంతో కలిసి డీఈవో వద్దకు వెళ్లారు. దీంతో చిర్రెత్తిన ఆయన నాకే ఎమ్మెల్యేతో సిఫార్సు చేయిస్తావా అని ఇష్టానుసారం ఆమెను తిట్టారు. ఎమ్మెల్యే లెటర్‌ను చించి పడేశారు. వెంట వచ్చిన హెచ్‌ఎంకు షోకాజ్ ఇచ్చి మూడు రోజుల పాటు విచారణకు ఆదేశించారు. ఇదే తరహాలో సర్వశిక్షలో కూడా కీలక పోస్టులో సుదీర్ఘంగా ఉన్న ఓ అధికారి కూడా వైసీపీ సానుభూతిపరుడే. ఇప్పటికీ అదే తరహాలో వ్యవహరిస్తున్నారు.

పాత వాసనలతో పోలీసు అధికారులు

చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తీరుతో చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ బేజారు అయిపోతున్నారు. వీరు ఇప్పటికీ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తూ టీడీపీ శ్రేణుల్ని ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్నికలకు ముందు వైసీపీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి వెంట ఎస్కార్ట్‌గా వెళ్లిన వన్ టౌన్ సీఐ.. ఇప్పుడు గురజాల విషయంలో నిబంధనలు ఒప్పుకోవంటున్నారు. కానిస్టేబుల్‌ను ఎస్కార్ట్‌గా పంపిస్తున్నారు. ఇలాగే జిల్లాలో పోలీసు అధికారులు.. ఎలాగూ బదిలీ అవుతామని భావించి పాత వాసనలతోనే పనిచేస్తున్నారు. టీడీపీని ఇబ్బందిపడుతున్నారు.

- గతంలో వైసీపీ విధేయురాలిగా పనిచేసిన కార్పొరేషన్ కమిషనరు అరుణ.. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ప్రస్తుత ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉంటున్నారు. చిత్తూరు తహసీల్దారు మాత్రం లెక్కలేనితనంతో ఉన్నట్లు సమాచారం.

● తాజా రాజకీయం

వైసీపీలో దూకుళ్లకు ఉబలాటం..!

టీడీపీలోకి దూకేయడానికి వైసీపీ గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు ఉబలాటపడిపోతున్నారు. వారిటు వచ్చేస్తే తమకు సమస్యలు మొదలవుతాయేమోనని టీడీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. అయితే పార్టీ పటిష్ఠతకోసం బయటినుంచి చేరికలు అవసరమేనని అధిష్ఠానం అభిప్రాయపడుతోంది. దీంతో వైసీపీలో బుజ్జగింపుల పర్వం మొదలైంది. ఈ పరిణామాలతో కుప్పంలో రాజకీయం వేడెక్కింది.

- కుప్పం

- విందు సమావేశాలతో నాయకత్వం బుజ్జగింపులు
- తటస్థులకు చంద్రబాబు పచ్చజెండా
- టీడీపీ శ్రేణుల్లో ఆందోళన
- పార్టీ పటిష్ఠతకు చేరికలు అవసరమేన్న అభిప్రాయం



మల్లానూరులో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో జరిగిన వైసీపీ సమావేశం

కుప్పం నియోజకవర్గంలో ఆదివారం రెండు చెప్పుకోదగ్గ పరిణామాలు సంభవించాయి. అందులో ఒకటి వైసీపీ మండల కన్వీనర్ హెచ్‌ఎం. మురుగేశ్, ఎంపీపీ అయిన తన కుమార్తె అశ్వినితో కలిసి మల్లానూరులో విందు సమావేశం నిర్వహించడం. టీడీపీలో చేరడానికి ఉబలాటపడుతున్న తమ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలను బుజ్జగించి కట్టడి చేయడానికి ఉద్దేశించింది ఈ సమావేశం. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించడం రెండో ముఖ్య పరిణామం. వైసీపీలోని తటస్థులను పార్టీలో చేరడానికి ఈ కాన్ఫరెన్సులో ఆయన పచ్చజెండా ఊపారు.

నిజానికి రాష్ట్రంలో టీడీపీ అప్రతిహత విజయంతో కుప్పం నియోజకవర్గ వైసీపీ ప్రజాప్రతినిధులు ఇటువైపు చూడడం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, 9 మంది కౌన్సిలర్లతో కలిసి విజయవాడదాకా వెళ్లి పార్టీలో చేరడానికి యత్నించడంతో ఈ ప్రయత్నాలు ఊపందుకున్నాయి. చంద్రబాబు, లోకేశ్ అపాయింట్‌మెంట్ దొరక్క వీళ్లు వెనక్కు వచ్చేయాల్సి వచ్చింది. నేడు కాకపోతే రేపైనా మున్సిపల్ చైర్మన్‌తోపాటు ఆ పార్టీ కౌన్సిలర్లలో ఎక్కువ మంది టీడీపీలో చేరడం ఖాయమన్న అభిప్రాయం నెలకొంది. ఇక, నాలుగు మండలాల్లోనూ ఎంపీటీసీలు, సర్పంచులు టీడీపీలోకి దూకడానికి ఉవ్విళ్లూరుతున్నారు. నాలుగుచోట్లా వైసీపీ ఎంపీపీలే ఉన్నారు. జనరల్‌కు కేటాయించిన రామకుప్పం ఎంపీపీగా ఎన్నికైన శాంతకుమారి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ స్థానానికి ఎన్నికల షెడ్యూల్ వెలువడడం తప్ప ఇంతదాకా ఎన్నికలు మాత్రం జరగలేదు. మిగిలిన మూడు మండలాల్లో ఒక్క కుప్పంలో తప్ప ఇతర రెండు మండలాల ఎంపీపీలూ, తమ ఎంపీటీసీలతో కలిసి ఇప్పటికే టీడీపీలో చేరడానికి సమాచారం. గుడుపల్లె మండలంలో టీడీపీ నాయకుడు ఒకరు 9 మంది వైసీపీ ఎంపీటీసీలను జట్టుగా చేసుకుని పార్టీలో చేర్పించడానికి ప్రయత్నిస్తుండగా.. మిగిలిన టీడీపీ నాయకులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇక, శాంతిపురం.. రామకుప్పం మండలాల్లోనూ చాలామంది ఎంపీటీసీలు పార్టీ మారడానికి ఉత్సాహం చూపుతున్నారు. సర్పంచులదీ అదే బాట. నియోజకవర్గంలోని 89 గ్రామ పంచాయతీలకు గాను 14 టీడీపీ గెలుచుకోగా మిగిలిన సర్పంచులందరూ వైసీపీ మద్దతుదారులే. ఎవరి స్థాయిలో వారు పార్టీ మారేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. గేట్లు తెరిస్తే చాలు, వైసీపీ ఖాళీ అయిపోయేలా చేరికలు ఉండనున్నాయి.

వైసీపీ బుజ్జగింపులు

కుప్పం మండలంలోనూ పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు టీడీపీలో దూకేయడానికి సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిని అడ్డుకోవడానికి మండల వైసీపీ కన్వీనర్, ఎంపీపీ అశ్విని తండ్రి హెచ్‌ఎం. మురుగేశ్ ఆదివారం విందు సమావేశం నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పార్టీ వీడిపోవద్దని ఈ సమావేశంలో ఆయనతోపాటు ఆయన కుమార్తె ఎంపీపీ అశ్విని కూడా సర్పంచులు, ఎంపీటీసీలను బతిమాలుకున్నారు. స్పీకర్ పెట్టి ఎంపీ మిథున్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. విందుకు వచ్చిన ఏ ఒక్కరూ కూడా పార్టీ వీడేది లేదంటూ హామీ ఇవ్వలేదు. నిర్వాహకులు వారినుంచి అటువంటి హామీ రాబట్టలేక నిరాశచెందారు. మిగిలిన చోట్ల ఎంపీపీలే టీడీపీలో దూకడానికి ఉవ్విళ్లూరుతుండడం, మిగిలిన మండల నేతలకు ఇతరులను కలుపుకొనిపోయే మనస్తత్వం లేకపోవడం దీనికి ప్రధాన కారణం.

సర్వే పూర్తయ్యాకే నామినేటెడ్ పోస్టులు

- అభివృద్ధిలో కడా పీడీదే నిర్ణయం
- సమన్వయం చేసుకుని వెళ్లాలి
- టెలి కాన్ఫరెన్సులో టీడీపీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం



పార్టీకోసం, ప్రజలకోసం కష్టపడిన వారికే ఏ పదవులైనా దక్కుతాయని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అన్ని సర్వేలు పూర్తయ్యాకే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు గంటపాటు ఆయన కుప్పం నియోజకవర్గ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ పదవుల్లోని వివిధ విభాగాల నాయకులు, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నామినేటెడ్ పోస్టులపై ఒకరిద్దరు నాయకులు ప్రస్తావించగా.. తాను నాయకుల పనితీరుపై ఒకటిరెండు సర్వేలు చేయిస్తున్నానని చంద్రబాబు చెప్పారు. ఒక్క కుప్పమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వేలు జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయ్యాక అర్హులైన నాయకులకు నామినేటెడ్ పోస్టులు ఇస్తామని స్పష్టం చేశారు. అందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఇక వైసీపీనుంచి చాలామంది టీడీపీలో చేరడానికి తహతహలాడుతున్న విషయంపై చర్చ జరిగింది. పార్టీ బలోపేతానికి చేరికలు అవసరమేనని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. వైసీపీలో ఉంటూ తటస్థంగా వ్యవహరించిన వారిని తీసుకోవచ్చని సూచించారు. దీనివల్ల పార్టీకి బలం చేకూరుతుందన్నారు. అదే సమయంలో తొలినుంచీ పార్టీకోస పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు నష్టం కలగకుండా, వారి అభివృద్ధి ఏమి చేయాలో, ఎలా పైకి తీసుకు రావాలో ఒక ప్రణాళిక సిద్ధం చేస్తానన్నారు. పార్టీలో కష్టపడిన వారికి ప్రతిఫలం దక్కుతుందని, కార్యకర్తలకు అన్యాయం జరగదని స్పష్టంచేశారు. అభివృద్ధి విషయంలో కడా పీడీదే తుది నిర్ణయమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయనను సమన్వయం చేసుకుని టీడీపీ నాయకులు పనిచేయాలని సూచించారు. కార్గో ఎయిర్ పోర్టు, కేంద్రీయ విద్యాలయ, కృషి విజ్ఞాన కేంద్రం పనులను త్వరిత గతిన పూర్తి చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని చెప్పారు. పాలకు తక్కువ ధర ఇస్తున్నారని కొంతమంది నేతలు ప్రస్తావించగా ఆ విషయం తాను పరిశీలించి చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తానని చెప్పారు. ఎక్కడ ఎటువంటి పొరపాటు జరిగినా, ప్రజలతో అమర్యాదగా ప్రవర్తించినా, ఇతరత్రా అక్రమాలు, అవినీతి చర్యలకు పాల్పడినట్లు తెలిసినా పార్టీ ప్రతిష్ఠ కోల్పోవాల్సి వస్తుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అటువంటి వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాని చంద్రబాబు హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్సులో కుప్పం అభివృద్ధిపైనా చర్చ జరిగిన నేపథ్యంలో కడా పీడీ వికాస్ మర్మత్ కూడా పాల్గొన్నారు.

తటస్థులకు చంద్రబాబు పచ్చజెండా!

వైసీపీనుంచి తటస్థులను టీడీపీలో చేర్చుకోవడానికి అధినేత చంద్రబాబు సుముఖంగానే ఉన్నట్లు సమాచారం. ఆదివారం తమ పార్టీ శ్రేణులతో ఆయన టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వైసీపీనుంచి టీడీపీలో చేరికల గురించి స్థానిక నాయకులు ఆయన వద్ద ప్రస్తావించారు. వాళ్లు ఒకింత వ్యతిరేకతతోనే ఆ ప్రస్తావన తీసుకొచ్చారు. చంద్రబాబు మాత్రం తటస్థులను చేర్చుకోవడానికి అభ్యంతరం ఏమీ లేదన్నట్లు తెలిసింది. తటస్థులను చేర్చుకోవడంవల్ల పార్టీకి లాభమే కానీ, నష్టం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చేరికల వల్ల మొదటినుంచీ పార్టీకోసం కష్టపడుతున్నవారికి ఎటువంటి కష్టనష్టాలు జరగకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇది కేడర్‌కు ఇష్టంలేదని ఒకరిద్దరు నేతలు అడ్డుచెప్పబోగా.. మీరెందుకు మెజారిటీ పెంచలేకపోయారని చంద్రబాబు నిలదీయడంతో వారు మౌనందాల్చారు. ఈ నేపథ్యంలో త్వరలోనే కుప్పం నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

టీడీపీ నేత కారుకు నిప్పు

- పుంగనూరులో అర్ధరాత్రి దుండగుల దుశ్చర్య



పుంగనూరు, జూలై 21: పుంగనూరులోని తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకుడు ఎస్.నదీమ్‌కు చెందిన కారుకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. రామ్‌నగర్ శివార్ల లోని తన ఇంటి పక్కన షెడ్డులో కారు ఉంచారు. దుండగులు ఈ చర్యకు పాల్పడ్డారు. షెడ్డులో నుంచి మంటలు వస్తుండటంతో పక్కన వారు గుర్తించి నదీమ్‌కు సమాచారం ఇచ్చారు. అందరూ కలిసి మంటలను ఆర్పేశారు.

- 'మిగులు భూములు' పేరిట

తప్పుగా నమోదు

పట్టాదారు పేర్ల పునరుద్ధరణకు కలెక్టర్ ఆదేశం

కుప్పం, జూలై 21: కుప్పం మండలంలో పట్టాదారు పేర్లతో ఉన్న భూములను గతంలో 'మిగులు భూములు' గా తప్పుడు నమోదు చేశారని రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. ఆ భూములను తిరిగి మ్యుటేషన్ చేసి, ఆయా పట్టాదారుల పేరుతో పునరుద్ధరించాలని తహసీల్దారును కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పంలో మిగులు భూములపై వారం పదిరోజులుగా గ్రామస్థాయిలో సర్వే జరుగుతున్న విషయం తెలిసిందే. గ్రామసభలు నిర్వహించి సంబంధిత రైతులనుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి రెవెన్యూ రికార్డులు, పట్టాదారులు రూపొందించిన పత్రాలను పరిశీలించి గ్రామస్తుల ద్వారా తీర్మానం చేశారు. ఈ భూములపై ఎలాంటి వివాదాలు, కోర్టు కేసులు లేవని విచారణలో తేల్చారు. వెబ్ ల్యాండ్‌లో పేర్ల దిద్దుబాటు అవసరమైన భూములు 5499.5 ఎకరాలుగా తేల్చారు. అలాగే వెబ్‌ల్యాండ్ అడంగల్‌లోని సైట్ నెంబర్లు తొలగించాల్సిన భూములు 7.475 ఎకరాలు, ధ్రువీకరించిన సైట్ నెంబర్లు గలవి 556.975 ఎకరాలుగా పేర్కొన్నారు. ఆయా భూములను పట్టాదారు పేర్లతో పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అడవిబూదుగూరు, అడవిములకలపల్లె, వసనాడు, పలార్లపల్లె, పెద్దగోపనపల్లె, కుర్మాయపల్లె, కమతమూరు, కుప్పం, పోర్లగుంట్లపల్లె, చలార్లపల్లె, చిన్నఒబ్బ, కనమ పచ్చార్లపల్లె, కంగుంది, చిన్న కురబలపల్లె, నూలుకుంట, బేవనపల్లె, దాసేగానూరు, టి.సదుమూరు తదితర గ్రామాలలో మ్యుటేషన్ ప్రక్రియ కొనసాగనుంది. ఆయా పంచాయతీలవారీగా రైతుల పేర్లతో జాబితా కూడా విడుదల చేశారు.

శాకాంబరిగా మరగదాంబిక



మణికంఠేశ్వరాలయంలో కూరగాయలతో ఏర్పాటు చేసిన శివలింగం

ఐరాల(కాణిపాకం), జూలై 21: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ.. మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆషాడపౌర్ణమిని పురస్కరించుకుని శాకాంబరి అలంకారంలో మరగదాంబిక భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలనూ వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో వెంకటేశు, అధికారులు మణికంఠేశ్వర స్వామి ఆలయానికి పూజా సామగ్రిని సారెలా తీసుకొచ్చారు. ఉదయం మణికంఠేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహించారు. కాగా, ఆలయంలో శాకాంబరి అలంకరణ కోసం పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి, మోహనరెడ్డి,సత్యనారాయణశెట్టి, బాబురెడ్డి బృందం 14 టన్నుల కూరగాయలను అందించారు. ఆషాడపౌర్ణమిని పురస్కరించుకుని వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనానికి సుమారు మూడు గంటలకుపైగా పట్టింది.

శాకాంబరి అలంకారంలో మరగదాంబిక - స్వామి దర్శనార్థం ప్రధాన ఆలయంలో ఉన్న భక్తులు







కన్నులపండువగా శ్రీవారి గరుడవాహనసేవ



తిరుమల క్షేత్రంలో ఆదివారం గరుడసేవ కన్నుల పండువగా జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించారు. ఆదివారం సెలవుదినం, గురుపౌర్ణమి కూడా కావడంతో భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వాహనసేవ వైభవంగా జరిగింది. గ్యాలరీల్లోని భక్తులు కర్పూర హారతులిస్తూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకుని ఆనందపరవశులయ్యారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బోయకొండలో భక్తుల రద్దీ

చౌడేపల్లె, జూలై 21: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లును ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. కాగా, అమ్మవారికి ప్రీతికరమైన చండీ హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఆశీర్వాద మండపం వద్ద కలశ స్థాపన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలమంత్రాన్ని భక్తులచే పఠింప చేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీహోమాన్ని భక్తులచే ఆచరింపజేశారు.





బోయకొండ గంగమ్మ దర్శనానికి క్యూలైన్లలో వేచియున్న భక్తులు



ప్రొఫెసర్లతోపాటు జాతీయ గీతం పాడుతున్న గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్, కేవెన్ సత్యనారాయణ

సామాజిక బాధ్యత

అలవర్చుకోండి

- ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్
- ఘనంగా ఐఐటీ ఆరో స్నాతకోత్సవం
- 338మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

ఏర్పేడు, జూలై 21: ప్రతి విద్యార్థీ సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్ పిలుపునిచ్చారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరో స్నాతకోత్సవాన్ని అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఆరు గంటలకు ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు కోపైలెట్‌గా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతికత అనేది కేవలం ఒక సాధనం మాత్రమే కాకుండా సహ ఇంటెలిజెన్స్ భాగస్వామి అని చెప్పారు. సాంకేతికత కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. తిరుపతి ఐఐటీలో చదువుకోవడం అదృష్టవంతులుగా భావిస్తున్నానన్నారు. మీరు చేసే అన్ని ప్రయత్నాల్లో శ్రేష్ఠత కోసం కృషి చేయాలని అన్నారు.





అనూష్ మంగళ్‌కు ప్రెసిడెంట్ అవార్డు, ఎంఎస్ స్నేహకు గవర్నర్స్ అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులతో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

2047నాటికి వీక్షిత్ భారత్‌గా మార్చాలి: సజ్జన్ జిందాల్

మనదేశాన్ని 2047నాటికి వీక్షిత్‌భారత్‌గా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నం చేస్తోందని బోర్డు ఆఫ్ గవర్నర్స్ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. స్నాతకోత్సవానికి సహ ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వీక్షిత్‌భారత్ కోసం చాలా సమగ్రమైన విధానం అవసరమని చెప్పారు. అంతేకాకుండా పౌరులందరి పట్టుదల, అంకితభావంతో మాత్రమే అది సాధ్యమవుతుందన్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం 1,500 మంది చదువుతున్నారన్నారు. వీరందరికీ అవసరమైన వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఐసర్ డైరెక్టర్ శాంతనూ భట్టాచార్య, ఐఐటీ పీఆర్వో చమన్ మెహతా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్ కుమార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అవార్డులు, డిగ్రీలిలా..

క్రిస్ గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్ చేతుల మీదుగా అవార్డులను విద్యార్థులు అందుకున్నారు. ప్రెసిడెంట్ అవార్డును అనూష్ మంగళ్, గవర్నర్స్ అవార్డును ఎంఎస్ స్నేహ, ప్రొఫెసర్ కంటమ్ కృష్ణయ్య అవార్డును అరిమంత భవన్‌రెడ్డి, రామకృష్ణ లక్ష్మీకాంత మెమోరియల్ ప్రైజ్‌ను ప్రశాంత్‌సింగ్, అమరరాజా గ్రూప్ అవార్డును డేవిడ్సన్ పొల్ల, ఇన్‌స్టిట్యూట్ అవార్డులను జనపతి వెన్నెలదేవి, ఇందుకూరి నాగమహిత అందుకున్నారు. అలాగే 210మంది బీటెక్ డిగ్రీలు, 76మందికి ఎంటెక్, 28మందికి ఎమ్మెస్సీ 16మందికి ఎంపీపీ, ముగ్గురికి ఎంఎస్ పరిశోధన, ఐదుగురికి పీహెచ్‌డీ, ఇన్‌స్టిట్యూట్ నుంచి ఒకరికి డిప్లొమా డిగ్రీలు ప్రదానం చేశారు. మొత్తంగా 338మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవం ప్రారంభానికి ముందు అమరరాజా గ్రూప్ ఛైర్మన్, అండ్ డైరెక్టర్ మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఐఐటీని సందర్శించారు. అనంతరం ఐఐటీ అధికారులతో సమావేశమై అమరరాజా గ్రూప్ సంస్థ బ్యాటరీ తయారీ రంగంలో ఎలా ముందుకు పోతుందో అనే విషయాలను వివరించారు. స్నాతకోత్సవానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు, నిపుణులు హాజరయ్యారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది.



రామకృష్ణ లక్ష్మీకాంత్ మెమోరియల్ ప్రైస్ అందుకుంటున్న ప్రశాంత్‌సింగ్



అమరరాజ ప్రైస్ అందుకుంటున్న డేవిడ్‌సన్ పొల్ల





ఇన్‌స్టిట్యూట్ ప్రైస్ అందుకుంటున్న ఇందుకూరి నాగమహిత, జనపతి విన్నెలదేవి

పూర్వజన్మ సుకృతం

ప్రెసిడెంట్ అవార్డు అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. ఇంత మందిలో నాకు అవార్డు రావడం గర్వంగా ఉంది.

- అనూష్ మంగళ్, ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత

ఆనందంగా ఉంది

నాకు గవర్నర్స్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. ప్రతి ఒక్కరూ బాగా చదుకోవాలని కోరుతున్నా.

- ఎంఎస్ స్నేహ, గవర్నర్స్ అవార్డు గ్రహీత

నేడు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

చిత్తూరు, జూలై 21: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ తప్పక హాజరుకావాలని తెలిపారు. చిత్తూరు పాత డీపీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

చిత్తూరు (సెంట్రల్), జూలై 21: జాతీయ విద్యావిధానం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నుంచి వారం రోజులు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఈవో దేవరాజు, ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. జాతీయ విద్యావిధానం అమలుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించడం, 23న అభ్యసనా పునాది, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాలు అభివృద్ధి చేయడం, 24న క్రీడా పోటీల నిర్వహణ, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, 27న పర్యావరణ పరిరక్షణ, 28న సామాజిక భాగస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

టీడీపీలోకి పులిచెర్ల ఎంపీటీసీలు, సర్పంచులు



చల్లాబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీటీసీలు, సర్పంచులు

రొంపిచెర్ల, జూలై 21: పులిచెర్ల జడ్పీటీసీ మురళి ఆధ్వర్యంలో ఆ మండలానికి చెందిన నలుగురు వైసీపీ ఎంపీటీసీలు, 8మంది సర్పంచులు ఆదివారం టీడీపీలో చేరారు. రొంపిచెర్లలోని పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి వచ్చిన వీరు.. ఆయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కల్లూరు, కల్లూరు 1, పులిచెర్ల, మంగళంపేట ఎంపీటీసీలు రెడ్డిబాబుల్లా, మంజుల, ఈశ్వరి, రాశి, కల్లూరు, పాళెం, దేవళంపేట, పులిచెర్ల, 106రామిరెడ్డిగారిపల్లె, రేణుమాకులపల్లె, మంగళంపేట, చల్లావారిపల్లె సర్పంచులు ఎస్.ఎ.షుకూర్, సరస్వతి, ఉషారాణి, రాణెమ్మ, అనిత, వెంకటేష్, మధు, అమ్ములుకు చల్లాబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు పాలనలో మంచి జరుగుతుందని, ఆయన ఆశయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లతామన్నారు.

వేణుగోపాలస్వామి గుడి, గోపురం మధ్యలో దారి

ఒక వర్గం ప్రతిపాదన

- ఇలా వేరు చేయడం సరికాదన్న మరో వర్గం

చౌడేపల్లె, జూలై 21: చౌడేపల్లెలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి, గోపురానికి సంబంధం లేకుండా మధ్యలో దారి ఏర్పాటు చేయాలని ఒక వర్గం ప్రతిపాదించగా.. వద్దంటూ స్థానికుల వర్గం పేర్కొంది. ఈ పంచాయితీ గోపురం నిర్మాణకర్త ఎస్కే వెంకట రమణారెడ్డి వద్దకు ఆదివారం చేరింది. ఆలయ ఆవరణలోని కొన్ని కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకుడు తానా నాగరాజు మాట్లాడుతూ.. తరతరాలుగా ఆలయం సమీపంలో ఉన్న తమకు దారి ఇవ్వాలని, దారికోసం ఆలయ ప్రహరీకి, రాజగోపురం మధ్యలో సుమారు 20 అడుగుల దారిని అప్పటి వైసీపీ నాయకులు, కొందరు గ్రామస్తుల సూచనతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయాన్ని, గోపురాన్ని విడదీసినట్లు చేయటం ఆగమశాస్త్ర విరుద్ధమని మరొక స్థానికుల వర్గం వాదించింది. ఆలయంతోపాటు రాజగోపురం ప్రహరిని కలిపి కట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి ఆలయ ఆవరణలో స్థానికులతో మాట్లాడుతూ.. త్వరలో శారద మఠం పీఠాధిపతులతో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ, రాజగోపురం కలశ ప్రతిష్ఠ, సుదర్శన హోమాలు చేయనున్నట్లు తెలిపారు. కాబట్టి గ్రామస్తులు, ఆలయ సమీపంలో నివాసమున్న వారు కలసి ఆమోదయోగ్యమైన ఒక నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులు మాత్రం ఆలయ ఆవరణలో కుటుంబాలు ఉంటే అంటు, మైలి వంటివి జరుగుతాయని, అలాగైతే అరిష్టమని పేర్కొన్నారు. నివాసాలకు, ఆలయానికి సంబంధం లేకుండా ఆలయాన్ని, రాజగోపురాన్ని కలిపి పనులు చేయించాలని కోరారు. కాగా, అక్కడి కుటుంబీకులకు ఆలయం వెనుక వైపు నుంచి ప్రత్యామ్నాయ దారి చూపించాలని కొందరు సూచిస్తున్నారు.



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్కే రమణారెడ్డి

తహసీల్దార్లకు నేడు రిలీవింగ్ ఆర్డర్లు!

చిత్తూరు కలెక్టరేట్, జూలై 21: ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు సొంత ప్రాంతాలకు వచ్చేస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి చిత్తూరుకు వచ్చిన తహసీల్దార్లు తమ ప్రాంతాలకు వెళ్ళేందుకు సిద్ధమౌతున్నారు. ఫిబ్రవరి 1న జిల్లా నుంచి కడప, అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాలకు 31 మంది వెళ్ళగా, ఆ జిల్లాల్లోనుంచి 31 మందిని జిల్లాకు అలాట్ చేశారు. వారిలో ఇద్దరు మినహా 29 మంది మాత్రమే చిత్తూరు జిల్లాకు వచ్చారు. సీఎం చంద్రబాబు తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రెండ్రోజుల క్రితం రెవిన్యూ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న 29 మంది తహసీల్దార్లను సోమవారం రిలీవ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఫైలును కలెక్టరేట్‌లోని రెవిన్యూ విభాగం సిద్ధం చేసి, సోమవారం కలెక్టర్‌కు అందించనుంది. రిలీవింగ్ ఆర్డర్లు అందుకున్న తర్వాత పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారు ఒక్కొక్కరుగా రిలీవ్ కానున్నారు. ఆ తర్వాత వారంతా మంగళ, బుధవారాల్లో తమ జిల్లాల కలెక్టరేట్లలో రిపోర్టు చేసుకోవాల్సిఉంటుంది. ఇతర జిల్లాలకు చిత్తూరు జిల్లా నుంచి వెళ్ళిన తహసీల్దార్లకు జిల్లాకు వచ్చాక వారికి కలెక్టర్ పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. జిల్లాకు వచ్చే తహసీల్దార్లకు వారి సొంత డివిజన్‌లో పోస్టింగ్స్ ఇవ్వవద్దని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) జారీచేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్లు జిల్లాకు వచ్చినా గతంలో వారు పనిచేసిన మండలాలను కేటాయిస్తారా? లేక వేరే మండలాలకు పంపుతారా? అనే అంశంపై స్పష్టత రాలేదు.

ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ..

జిల్లాలో చిత్తూరు అర్బన్‌తో కలిపి 32 మండలాలు.. చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి ఆర్డీవో కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ ఏవోలుగా, సెక్షన్ సూపరింటెండెంట్లుగా ఐదుగురిని నియమించాల్సి ఉంటుంది. ఇంకా 32 మంది తహసీల్దార్లను సర్దుబాటు చేయాలి. కాగా, చిత్తూరు, నగరి, పూతలపట్టు,త గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు తొలిసారిగా ఎన్నికైన శాసనసభ్యులు ఉన్నారు. వైసీపీ హయాంలో ఆయా తహసీల్దార్ల పనితీరును బేరీజు వేసుకుంటూ సమర్థంగా పనిచేసే అధికారుల కోసం కూటమి ఎమ్మెల్యేలు దృష్టి పెట్టినట్లు సమాచారం. దీంతో ఎవరెవరికి ఏ మండలంలో పోస్టింగ్స్ వస్తాయనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కొంత మంది తహసీల్దార్లు శాసనసభ్యుల వద్దకు, కూటమిలోని సీనియర్ నాయకుల వద్దకు వెళ్లి ప్రసన్నం చేసుకుంటున్నారు. సిఫార్సులేఖలు ఇప్పటికిప్పుడే ఇవ్వలేమని, ప్రభుత్వ ఆలోచన మేరకు నడచుకుంటామని శాసనసభ్యులు చెబుతున్నట్లు సమాచారం.

కీలక మండలాలకు పోటీ

జిల్లాలోని కీలక మండలాలైన చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి, పలమనేరు, కుప్పం, భూములు వివాదాలు ఎక్కువగా వున్న గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట, గుడుపల్లె, విజయపురం.. క్వారీలు ఎక్కువగా వున్న రెండు రాష్ట్రాల సరిహద్దులోని కుప్పం నియోజకవర్గంలోని మండలాల్లో పోస్టింగ్స్ కావాలని కొంతమంది తహసీల్దార్లు, ఎమ్మెల్యేలు, రెవిన్యూ అసోసియేషన్‌లో కీలక నాయకుల నుంచీ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

సీఎంను కలిసిన బీసీ నాయకుడు రమణ



పుంగనూరు, జూలై21: సీఎం చంద్రబాబును రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శి గాజుల రమణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం విజయవాడలో ముఖ్య మంత్రిని కలసి గత ప్రభుత్వంలో కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవడంతో బీసీలు ఆర్థిక ఇబ్బదులు పడ్డారని, తిరిగి కార్పొరేషన్లు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు.

సోమలలో డిగ్రీ కళాశాల కోసం సీఎంకు వినతి



శ్రీనివాస్‌యాదవ్‌తో శ్రీనివాసులునాయుడు

సోమల, జూలై 21: సోమలకు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు సీఎం చంద్రబాబును, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌లను అమరావతిలో కలసి వినతిపత్రం అంద జేశారు. అలాగే సోమల నుంచి పెద్ద ఉప్పరపల్లెకు డబుల్ రోడ్డు, చెన్నపట్నం చెరువు నుంచి ఎస్టీ కాలనీ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మంజూరు చేయాలని వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివయ్య నాయుడు, సతీశ్ నాయుడు, శ్రీనివాసులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కుప్పం, జూలై 21: కుప్పంలోని మండల సచివాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. తన ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటదాకా నిర్వహించే ఈ వేదికలో ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించవచ్చన్నారు. ఆర్డీవో సహా, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరై ప్రజ లకు సంబంధించిన సమస్యలను పరిష్కారం చూపాలని ఆదేశించారు. అలాగే ప్రతి సోమవారమూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఇదేవిధంగా నిర్వహిస్తామని పీడీ తెలిపారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 62 మంది ఎంపిక

కుప్పం, జూలై 21: కుప్పంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో, బెంగళూరు శంకర నేత్రాలయ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. సుమారు 150 మంది కంటి రోగులు ఈ శిబిరంలో పరీక్ష చేయించుకున్నారు. వీరిలో 62 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరు శంకర నేత్రాలయ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం శివ, లావణ్య, నేత్ర, వీరభద్రప్ప పాల్గొన్నారు.

నేడు కొత్తపేట నుంచి తిరుమలకు టీడీపీ పాదయాత్ర

కల్లూరు, జూలై 21: పులిచెర్ల మండలం కొత్తపేట నుంచి తిరుమలకు సోమవారం ఉదయం చేపడుతున్న టీడీపీ పాద యాత్రను పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డి ప్రారంభిస్తున్నట్లు మండల టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడం, చంద్ర బాబు సీఎం కావడంతో పాదయాత్ర చేపడుతున్నామన్నారు.

సాయినాథుడికి ప్రత్యేకపూజలు



కల్లూరు, జూలై 21: పులిచెర్లలో వెలసిన సాయిబాబా ఆల యంలో ఆదివారం వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి కాగడ హారతి చేపట్టారు. పంచా మృతాభిషేకం, పాలాభిషేకం, విశేషాలంకరణ నిర్వహించారు. భక్తులకు అర్చకులు రాజశేఖర్ దీక్షితులు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

సాయిబాబాకు కర్పూర హారతులు



రొంపిచెర్ల, జూలై21: రొంపిచెర్లలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకొని భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి షిరిడిసాయిబాబాకు అభిషేకాలు, కాగడ హారతులు, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. రాత్రి ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించారు.

గుండ్లసాగరంలో పంజె ఊరేగింపు



గుడుపల్లె, జూలై 21: మండలంలో గుండ్లసాగరంలో ముస్లింలు ఆదివారం పంజె ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మొహరం పండుగ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పుష్పాలతో పంజె ను అలంకరించి డప్పుల హోరుతో గ్రామంలో ఊరేగించి ఉత్సవాలను ముగించారు.

వర్షాలు కురవాలని మునీశ్వరుడికి పూజలు



ప్రత్యేక అలంకరణతో మునీశ్వరుడు

గుడుపల్లె, జూలై 21: వర్షాలు కురవాలని మండల పరిధిలోని పెద్దబజనవాడలో మునీశ్వరుడికి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దబజనవాడలో కొలువైన మునీశ్వ రుడిని ఉదయం ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం మునీశ్వ రుడి ఉత్సవర్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు సమీప గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.

పరమహంస విద్యాలయంలో అక్షరాభ్యాసం



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

శాంతీపురం, జూలై 21: మండల పరిధిలోని పరమహంస యోగానంద విద్యాల యంలో గురు పూర్ణిమ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో సరస్వతి పూజ చేయించారు. అనంతరం పిల్లలతో పెద్దలకు పాద పూజలు చేయించారు. పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజాద్, కరస్పాండెంట్ రాధాకృష్ణన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాయి భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

బైరెడ్డిపల్లె, జూలై 21 : గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. బైరెడ్డిపల్లెలోవున్న శేషాద్రిస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకంచేసి విశేషాలంకరణతో పూజలు జరిగాయి. నిర్వాహకులు ధనంజయగౌడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే కోదండరామాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయం, బాటగంగమ్మ ఆలయం, నల్లాపురమ్మ ఆలయం, పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయం, కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. నెల్లిపట్ల గ్రామంలోవున్న అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు రూపేష్‌ఆచార్యులు, మురళీకృష్ణ విశేష పూజలు చేశారు. ధర్మవరం కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు.

జోరుగా జనసేన సభ్యత్వ నమోదు



కుప్పిగానిపల్లెలో సభ్యత్వ నమోదులో ఆ పార్టీ నాయకులు

గుడుపల్లె, జులై 21: మండలంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ నరేష్, మండలాధ్యక్షుడు అమీర్ తెలిపారు. ఆదివారం మండలంలోని పలు పంచాయతీల్లో జరుగుతున్న పార్టీ సభ్యత్వ నమోదులో కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు చేసుకొంటే ఐదు లక్షల బీమా పాలసీ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు, విన్నీ, చంద్రశేఖర్, శీను, మణికంఠ, శ్రావణ్ కుమార్, రావణ్, మురళి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నీటికోసం ధర్నా



గుడుపల్లె, జులై 21: మండలంలోని కుప్పిగానిపల్లెలో నీటి సమస్య పరిష్కరించాలని గ్రామ సచివాలయం ఎదుట గ్రామస్తులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పిగానిపల్లెలో కొన్ని నెలలుగా నీటి సమస్య నెలకొందన్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించు కోలేదన్నారు. నిత్యం నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగు నీరును తెచ్చుకుంటున్నామని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

తెలుగు భాష పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

గంగవరం, జూలై 21: రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం తెలుగు భాషను రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు కోరారు. 'తెలుగు భాష - నూతన ప్రభుత్వం' అనే అంశంపై ఆదివారం స్థానిక కళామందిరంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉత్తర్వులు, కార్యాలయాల బోర్డులు తెలుగులోనే ఉండేలా చూడాలన్నారు. దీంతోపాటు తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించేలా చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సంస్థ కార్యదర్శి పుష్పలతోపాటు పలువురు పాల్గొన్నారు.

సాయిసేవలో తరించిన భక్తజనం

గంగవరం, జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. తర్వాత ప్రత్యేక పూలాలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలమనేరు, గంగవరం పరిసరప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలంలోని పలు ఆలయాలలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని పంచ ముఖాంజ నేయస్వామి ఆలయం, కోగిలేరు జలకంఠేశ్వరాలయం, ముత్తుకూరు కాశీ విశ్వేశ్వరాలయం, నడిం పల్లె భక్తాంజనేయ స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాల కిటకిటలాడాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు.



పార్కింగ్ ప్లేస్‌గా పాఠశాల



పాఠశాల ఆవరణలో పార్క్ చేసిన ప్రైవేటు వాహనాలు

రొంపిచెర్ల, జూలై21: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె ప్రాథ మిక పాఠశాల ప్రైవేట్ వాహనదారులకు పార్కింగ్ జోన్‌గా మారి పోయింది. గతంలో మండలానికి మంజూరైన మోడల్ స్కూల్‌ను తాత్కాలికంగా ఈ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు గదులు కేటాయించారు. కొంతకాలం తర్వాత సబ్‌స్టేషన్ వద్ద మోడల్ స్కూల్‌కు నూతన భవనం నిర్మించారు. దీంతో ప్రాథమిక పాఠశాల తరగదుల్లో ఉంటున్న విద్యార్థులు సొంత భవనంలోకి వెళ్లిపోయారు. ఇదే సమయంలో రోడ్డు విస్తరణలో భాగంగా ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూల్చి వేశారు. ఈ క్రమంలో మోడల్ పాఠశాలకు కేటాయించిన గదులు ఖాళీగానే ఉండిపోయాయి. ప్రహరీ లేకపోవడం, గదులు ఖాళీగా ఉండడంతో ఇటు తిరుపతి, అటు మదనపల్లి మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు పాఠశాలకు పార్కింగ్ కేంద్రంగా వినియోగించు కుంటున్నారు. అయితే గతంలో మోడల్ స్కూల్‌కు సర్దుబాటు చేసిన తరగతి గదులను ప్రాథమిక పాఠశాల వారు ఎందుకు వినియోగంచలేదో అర్థం కావడంలేదు. పలుచోట్ల తరగతి గదులు చాలక చెట్ల కింద పిల్లలు చదువుకునే పరిస్థితులు ఉన్నాయి. ఇక్కడ గదులు ఉన్నా నిరుపయోగంగా ఉండడం గమనార్హం. ఆ గదులను వినియోగించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావాలని, ప్రైవేటు వాహనదారులు పాఠశాల ఆవరణలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



కుప్పం హెచ్‌పీ రోడ్డులో పూజలందుకున్న షిరిడీ సాయి

కుప్పం, జూలై 21: కుప్పం లోని పలు షిరిడీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురు పౌర్ణమిని పురస్కరించుకుని పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహిం చారు. పట్టణంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న ద్వారకా మయి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయిబాబా కీర్తనలను భజనబృందం గానం చేశారు. ఈ కార్యక్రమంలో జగదీశ్‌బాబు, భార్గవ్, లిఖిత్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు. ● హెచ్‌పీ రోడ్డులో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉదయం హోమాలు, అభిషేకం, మధ్యాహ్నం హారతి పూజలు జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. వి.కోటకు చెందిన సత్యసాయి భజన మండలి, సత్యసాయి సేవా సమితి సంయుక్తంగా విశేష ఆధ్యాత్మిక కార్యక్ర మాలు నిర్వహించాయి. ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త డాక్టర్ యశోద, జిల్లా బాల వికాస్ సమన్వయకర్త వసంత, ఇన్‌ఛార్జి సావిత్రి సామూహికంగా వేద పఠనం చేశారు. గురు పౌర్ణమి విశిష్టత గురించి వక్తలు ప్రసంగించారు. పేదలకు అమృత కలశం అందించారు. బాల వికాస్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ బాల వికాస్ జాయింట్ కో-ఆర్డినేటర్ అమర్‌నాథ్, కుప్పం సమితి స్పిరిట్యువల్ సమన్వయకర్త కుసుమ, యూత్ జాయింట్ కో-ఆర్డినేటర్ జి.హరి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న యశోద తదితరులు

నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయండి



నారాయణపురంతాండాలో స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు

రామకుప్పం, జూలై 21: సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీయార్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారాభువనేశ్వరి కుప్పం నియోజకవర్గ పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ 25న ఆమె ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరిమానిపెంట, వీర్నమలల్లో పర్యటించి స్థానిక మహిళలతో సమావేశమవుతారన్నారు. అలాగే పార్టీ శ్రేణులతో, గ్రామసుస్తులతో సమావేశమవుతారని తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే సమావేశాలకు పెద్దసంఖ్యలో మహిళలు, గ్రామస్తులు హాజరయ్యేలా నేతలు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. అనంతరం భువనేశ్వరి సభల నిర్వహించే స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు జయశంకర్, మనోహర్, నాగభూషణం, గజేంద్ర, సత్తి, లోకేశ్, మురళి, రఘు, కదిరప్ప, ప్రకాష్, రామూనాయక్, పాండియన్, జేయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవాలు



షిరిడిసాయిబాబాకు పూజలు చేస్తున్న ఎస్కే వెంకటరమణరెడ్డి, ఆయన సతీమణి రతీదేవి

చౌడేపల్లె, జూలై21: స్థానిక బజారువీధిలో వెలిసిన షిరిడిసాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బోయకొండ మాజీ చైర్మన్లు ఎస్కే వెంకటరమణారెడ్డి ఆయన సతీమణి రతిదేవిలు స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకురాగా ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి పంచామృతాభికాలు చేశారు. భక్తులు వారి స్వహస్తాలతో పాలాభిషేకం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు ఎస్కే దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి శాలువలతో సత్కరించారు.. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

జనసైనికుడి కుటుంబానికి రూ.5లక్షల సాయం



బైరెడ్డిపల్లె, జూలై 21 : మండలంలోని లక్కనపల్లె గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త బాలాజీ కుటుంబానికి పార్టీ తరఫున రూ.5లక్షల ఆర్థికసాయం అందించారు. బాలాజీ ఆరునెలల క్రితం రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబీకులకు ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జనసేన నాయకుడు నాగబాబు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి దిలీప్, మండలాధ్యక్షుడు చైతన్యకుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.

సోమలలో సాయిబాబా ఊరేగింపు



సోమల, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమల సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేసి మహా మంగళహారతి చేపట్టారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో అలంకరణచేసి బాణసంచా వేడుకలు, కోలాటాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు మునివెంకటప్ప, కార్యదర్శి నాగరాజ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో వైభవంగా పౌర్ణమి పూజలు



ఊరేగుతున్న అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి

రామకుప్పం, జూలై 21: రామకుప్పంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక, అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు కృష్ణమూర్తి, హరినాథ్‌లు సాయంత్రం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి అమ్మవారు, స్వామి వారి ఉత్సవర్లను మంగళవాయిద్యాలు, డప్పుల హోరు మధ్య నాలుగు మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు.

● రామకుప్పంలోని షిర్డిసాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి భక్తులే స్వయంగా స్వామి వారికి పాలాభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి మూల మూర్తి, ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుడుగునా కొబ్బరికాయలు కొట్టి, మంగళహారతులిచ్చారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

సోమల, జూలై 21: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సూర్యప్రకాశ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన మండల స్థాయి కమిటీ సమావేశంలో మండల అధ్యక్షుడు శివరాం మాట్లాడారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతీశ్వరుడు, ఇమ్రాన్, శ్రీనివాసులు, రామ్మోహన్, భాస్కర్, సురేశ్ బాబు, పృథ్వీ, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

సోమల, జూలై 21: మండలంలోని కమ్మపల్లె లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజాఅవరోహణంతో ఉత్సవాలు ముగిశాయి. మూల విరాట్‌కు విశేష పుష్పాలంకరణలు జరిపి అభిషేకపూజలు జరిపారు. శాస్త్రోక్తంగా వసంతోత్సవం, చక్రస్నానం వేదపండితులు నిర్వహించారు. రమేశ్‌నాయుడు, శంకర్ నాయుడు, భాస్కర్ నాయుడు, చిన్నరెడ్డెప్ప పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు



దత్తక్షేత్రంలో పూజలు చేస్తున్న అర్చకులు

పుంగనూరు రూరల్, జూలై21: గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలల్లో పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆదివారం స్థానిక పుంగమ్మ చెరువు మొరవలో వెలసిన దత్తక్షేత్రం, పుంగమ్మ చెరువు కట్టపైన కొత్తయిండ్లులో వెలసిన షిరిడి సాయిబాబా ఆలయాలలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ఎందుకీ వివక్ష..?

- పుంగనూరులో మంచిరోడ్డు ● పలమనేరులో గుంతల రోడ్డు
- రాయలపేట - పుంగనూరు రోడ్డుకు మోక్షం లేదా
- ప్రశ్నిస్తున్న పెద్దపెంజాణి జనం

పెద్దపంజాణి, జూన్ 21: 'మాపై ఎందుకీ వివక్ష' అని చెన్నారెడ్డిపల్లె, నగిరేపల్లె మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమ యమైన రాయలపేట - పుంగనూరు రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు. చెన్నారెడ్డిపల్లె, నగిరేపల్లె మధ్య రోడ్డు అధ్వానంగా ఉంది. నగిరేపల్లె దాటగానే పుంగనూరు నియోజకవర్గం మొదలవుతుంది. దాదాపు 20 గ్రామాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగి స్తుంటారు. పుంగనూరు నియోజకవర్గంలోని రోడ్డు మాత్రం అభివృద్ధి చేసి చెన్నా రెడ్డిపల్లె నుంచి రాయలపేట వరకు ఉన్న రోడ్డును గాలికొదిలేశారు. ఫలితంగా తేలికపాటి జల్లులకే రోడ్డు చిత్తడి అవుతోంది. కంకరతేలిపోయి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడంతో మలుపులలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు అప్పట్లో అధికారంలో ఉన్నా పుంగనూరులోని రోడ్డును మా త్రమే బాగుచేసి పలమనేరు నియోజకవర్గ పరిధిలోని రోడ్డును పట్టించు కోలేదు. దీనిపై అప్పటి ఎమ్మెల్యేని సైతం జనం నిలదీశారు. అయినా రోడ్డు బాగుపడింది లేదు.

అమర్‌పై ఆశలు..

ప్రభుత్వం మారడం, అమరనాథరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఈ రోడ్డు అభివృద్ధి చెందుతుందని ఇక్కడి జనం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నగిరేపల్లె నుంచి చెన్నారెడ్డిపల్లె వరకు అభివృద్ధి చెందితే 20 గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్వగ్రామం కెళవాతికి కేవలం కూతవేటు దూరంలో ఉన్న ఈ రోడ్డును బాగుచేయాలని జనం కోరుతున్నారు.





గుంతలమయమైన రోడ్డు, రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జూలై 21: కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన బాలాజీ ఆదివారం రూ.1,01,116 విరాళం అందించారు. దాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

వ్యాస మహర్షికి పూజలు



ఐరాల(కాణిపాకం), జూలై 21: వరసిద్ధుడి ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం వ్యాస మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాస మహర్షి చిత్రపటాన్ని ఉంచి గురు వందనం చేశారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఐరాల, జూలై 21: మండలంలోని ఎం.పైపల్లె జడ్పీ హైస్కూల్‌లో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలిశారు. పాఠశాల మొత్తం కలియ తిరుగుతూ అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. హెచ్ఎం అరుణ్‌కుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కృష్ణమనాయుడు, కన్నయ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి, మనోహర్, సరస్వతి, అన్వర్‌బాషా, దేవరాజులురెడ్డి, పురుషోత్తంనాయుడు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో ఆడికృత్తిక మహోత్సవాలు

చిత్తూరు కల్చరల్, జూలై 21: గిరింపేట శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణేశ్వరాలయంలో ఈనెల 29, 30 తేదీల్లో ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న భరణి ఉత్సవం, 29న ఆడికృత్తిక వేడుకలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కావడి మొక్కులు చెల్లించే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

జీవో 117 రద్దు చేయాలి : పీఆర్‌టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్

చిత్తూరు (సెంట్రల్), జూలై 21: జీవో 117ను రద్దు చేసి, ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్, కన్నన్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గిరిప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లోకి కలపడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులు బడికి దూరమై నష్టపోతున్నారన్నారు. సీపీఎస్ రద్దుతో పాటు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.

బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యతివ్వాలి : ఆపస్

చిత్తూరు (సెంట్రల్), జూలై 21: రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, సత్యనారాయణలు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగుల ఆర్థిక అంశాలకు తగిన కేటాయింపులు చేయాలని పేర్కొన్నారు.

నేడు ఓబనపల్లె ఉరుసు మహోత్సవం

చిత్తూరు కల్చరల్, జూలై 21: నగరంలోని ఓబనపల్లెలో సోమవారం ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నట్లు ఖుద్రతి చమన్ దర్గా ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పకీర్లతో ఊరేగింపు, గంధోత్సవం, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని, నగరవాసులు పాల్గొని షరీఫ్‌బాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

వైభవంగా సత్యసాయి పల్లకిసేవ



చిత్తూరు కల్చరల్, జూలై 21: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి భజనమండలి, బాలవికాస్ విద్యార్థులు బాబా భజనలతో అలరించారు. అనంతరం బాబా చిత్రపటాన్ని ప్రత్యేక పల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, వినాయకపురం సద్గురు ఆశ్రమ గురువులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు సత్కరించారు.

సీపీఐ సమావేశాన్ని జయప్రదం చేయండి

చిత్తూరు రూరల్, జూలై 21: వచ్చే నెల 4వ తేదీన జరిగే సీపీఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ విస్తరణ, ప్రజాసంఘాల బలోపేతంపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మణి, సత్యమూర్తి, కుమారి, కోమల పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన రాజేశ్వరి



చిత్తూరు సిటీ, జూలై 21: సీఎం చంద్రబాబును తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి ఆదివారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలసి సన్మానించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నానని, తనకు గుర్తింపు ఇవ్వాలని కోరారు.

అలరించిన దుర్యోధన వధ



పాలసముద్రం, జూలై 21: మండలంలోని బలిజకండ్రిగ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ తిరునాళ్లలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహించారు. ద్రౌపది, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల, సహదేవుల విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భీముడు, దుర్యోధనుల మట్టి బొమ్మలపై పాత్రదారులు యుద్ధ సన్నివేశాన్ని నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగిశాయి. శ్రీధర్, ఆనంద్, వాసు నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం కృష్ణమనాయుడు, రమేష్ నాయుడు అన్నదానం చేశారు.

గురువులను సత్కరించడం బాధ్యత



దామోదర్‌రెడ్డికి సన్మానం చేస్తున్న బీజేపీ నేతలు

గంగాధరనెల్లూరు, జూలై 21: గురువులను సత్కరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఇడగట్టి సుధాకర్ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా జీడీ నెల్లూరు (ఎగవూరు) సీతారాముల ఆలయంలో ఆదివారం రిటైర్డ్ హెచ్.ఎం దామోదర్‌రెడ్డిని బీజేపీ నేతలు సత్కరించారు. నారాయణమూర్తి ఆచారి, సుందరరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు 'గణిత ప్రజ్ఞాధారణ'

గంగాధరనెల్లూరు, జూలై 21: వేపంజేరి హైస్కూల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గణిత అవధాని అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం ఉంటుందని ఏపీ మ్యాథ్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. హెచ్.ఎం., టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తండ్రీ కొడుకులను ఓడించినా బుద్ధి రాలేదా? : టీడీపీ

గంగాధరనెల్లూరు, జూలై 21: సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా, ఒంగోలు ఎంపీగా పోటీ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని, భాస్కర్‌రెడ్డిని ప్రజలు చిత్తుగా ఓడించినా వారికి ఇంకా బుద్ధి రాలేదని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ విమర్శించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సీ.ఆర్.రాజన్‌ని టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తే ఎందుకు ఓర్వలేకపోతున్నారని ప్రశ్నించారు. వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా ఇవ్వలేదంటే ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవాలన్నారు. బీసీ నేతలను కించపరిచి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

ఎం.అగరంలో రోడ్డుకు మోక్షం



విజయపురం, జూలై 21: మండలంలోని ఎం.అగరంలో రోడ్డుకు మోక్షం కలిగింది. తుడా నిధులతో సిమెంటు రోడ్డు వేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా ఉన్న సమస్య ఇప్పటికి పరిష్కారమైందని వాహనదారులు చెబుతున్నారు.

టైలర్ల సంఘం నూతన కార్యవర్గం

నగరి, జూలై21 : టైలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పీసీఎన్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఉమాపతి, కార్యదర్శిగా వీరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీగా జగన్నాథం, సమన్వయకర్తగా శ్రీనివాసులు, నాగూర్‌బాషా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా రాజేందర్, వరదరాజులు, హమీద్, సలహా కమిటీ సభ్యుడిగా జగదీష్ ఎన్నికయ్యారు.

ఘనంగా సత్యనారాయణస్వామి పూజ



బంగారుపాళ్యం, జూలై 21: మండలంలోని మాధవనగర్ వద్దగల బ్రహ్మానంద ఆశ్రమంలో ఆదివారం ఆడి గురుపౌర్ణమిని పురస్కరించుకుని సత్యనారాయణ వ్రతాన్ని కేశవానంద స్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు కరణం సంక్షేమ సంఘ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

చెట్టు నుంచి పడి గాయాలు

కార్వేటినగరం, జూలై 21: చెట్టు నుంచి పడి యువకుడికి గాయాలైన ఘటన మండలం లోని పాదిరికుప్పం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పాదిరికుప్పం గ్రామానికి చెందిన చాణక్య నేరేడు పండ్లు కోయ డానికి చెట్టు ఎక్కాడు. చేయి జారడంతో కిందపడి గాయాలపాలయ్యాడు. గ్రామస్తులు వెంటనే అతన్ని కార్వేటినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మంజూరైంది ఒకచోట..ఏర్పాటైంది మరోచోట





మహదేవమంగళం గ్రామానికి దూరంగా ఏర్పాటైన వ్యవసాయ విత్తనాభివృద్ధి క్షేత్రం, విద్యుత్ సబ్‌స్టేషన్



సర్విరెడ్డిపల్లె సమీపంలో ఏర్పాటైన గురుకుల పాఠశాల

గంగాధరనెల్లూరు, జూలై 21: మండలంలో కొన్ని నిర్మాణాలు ఒకచోట మంజూరైతే.. స్థలాభావం వల్ల మరోచోట ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం లేకుండా పోతోంది. గంగాధరనెల్లూరు ఒకప్పుడు పంచాయతీ సమితి కేంద్రంగా ఉండేది. గంగాధరనెల్లూరు - తూగుండ్రం ప్రధాన రహదారి అనుకుని వ్యవసాయ విత్తనాభివృద్ధి క్షేత్రం (అగ్రికల్చర్ ఫామ్) వేపంజేరి, బంగారెడ్డిపల్లె పంచాయతీలకు మధ్యలో ఉంది. 280 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ క్షేత్రం రెండు పంచాయతీల పేర్లకు సంబంధం లేకుండా మహదేవమంగళం గ్రామం పేరుతో మంజూరై ఏర్పాటైంది. ఇందులోనే 60 ఎకరాల్లో 400 / 220 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ సబ్‌స్టేషన్ సైతం మహదేవమంగళం గ్రామం పేరుతోనే మంజూరైంది. ఏర్పాటు చేసిన ప్రస్తుత స్థలం మహదేవమంగళం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. అగరమంగళం గ్రామానికి 35 ఏళ్ల క్రితం 33/11 కె.వి.విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కాగా గ్రామస్తులు స్థలం కేటాయించలేని కారణంగా వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ గ్రామానికి సమీపంలోని రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. ఇది అగరమంగళం గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. బాలగంగనపల్లె పంచాయతీ మేనాటంపల్లె గ్రామానికి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మంజూరైతే స్థలం లేకపోవడంతో వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ గ్రామంలో ఏర్పాటు చేశారు. మేనాటంపల్లె పేరుతో మంజూరైన ఉన్నత పాఠశాల గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. గంగాధరనెల్లూరు పేరుతో బాలికల గురుకుల పాఠశాల మంజూరు కాగా, స్థలం లేకపోవడంతో వేపంజేరి పంచాయతీ సర్విరెడ్డిపల్లె బస్టాప్‌కు సమీపంలో 10 ఎకరాలు సేకరించి పాఠశాల, వసతి భవనాలు నిర్మించారు. దూరంగా ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు వాటివల్ల ప్రయోజనం కలగడం లేదు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, జూలై 21: స్థానిక ప్రాథమిక పాఠశాలలోని 90 మంది విద్యార్థులకు ఈశ్వర్ కళ్యాణ్ అభయ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మురళీ మోహన్ చేతుల మీదుగా ఆదివారం నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఎ.గొల్లపల్లె సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు. సత్యనారాయణ వ్రతంలో పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎ.గొల్లపల్లె వడ్డిపల్లెలో ప్రమాదాలకు గురై వికలాంగులైన సుబ్రహ్మణ్యం, మధులను పరామర్శించారు. దివ్యాంగ పింఛన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు, నేతలు ప్రవీణ్, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ : ఇద్దరికి గాయాలు



గంగాధరనెల్లూరు, జూలై 21: మండలంలోని బొబ్బిగానిపల్లె వద్ద శనివారం రాత్రి రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. బొబ్బిగానిపల్లె బస్టాప్‌కు సమీపంలో శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో లోడ్ లారీ టైర్ పంక్చర్ అయింది. రోడ్డుపక్కన పెట్టి టైరు మారుస్తుండగా అటుగా వచ్చిన మరో లారీ ఢీకొంది. ఢీకొట్టిన లారీ డ్రైవర్‌కు, టైరు మారుస్తున్న లారీ క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఢీకొట్టిన లారీ ముందు భాగం ధ్వంసమైంది. క్షతగాత్రులను ఆటోలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్నను వివరణ కోరగా తమకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.

పచ్చికాపల్లంలో భక్తిశ్రద్ధలతో బండి కుంభం



వెదురుకుప్పం, జూలై 21: మండలంలోని పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో బండి కుంభం కార్యక్రమం నిర్వహించారు. బకాసురుడికి బండి కుంభం తీసుకుని వెళ్లే ఘట్టాన్ని నిర్వహించారు. పెద్దపోడు జేను గ్రామం నుంచి ఆనవాయితీ ప్రకారం బండి కుంభం తీసుకెళ్లారు. అంతకు ముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో బండి కుంభం వేసి, ప్రసాదంగా భక్తులకు అందించారు. ఆలయ ధర్మకర్త ఎన్.మునిరత్నంరెడ్డి, ప్రధాన కార్యనిర్వాహకులు బండి గోవర్ధన్‌రెడ్డి, బొజ్జారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిత్తూరు నగరం గుంతలమయం





మిట్టూరులోని జైలుకానా వీధి, బక్కర్‌బాయి వీధిలో రోడ్లపై గుంతలు

చిత్తూరు రూరల్, జూలై 21: చిత్తూరు నగరం గుంతలమయమైంది. ఏ వీధి చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. సంవత్సరం క్రితం ఇళ్లకు నీటి సరఫరా కోసం పైపులైన్ వేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు బాగున్న రోడ్లను తవ్వేసింది. వర్షాలకు గుంతల్లో మట్టి కొట్టుకుపోయి మినీ బావుల్లాగా తయారయ్యాయి. వాహనదారులు వాటిలో పడి గాయాల పాలవుతున్నారు. గతనెల మిట్టూరులోని జైలుకానా వీధిలో గుంతలో పడి వృద్ధుడు తీవ్రగాయాల పాలయ్యాడు. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న కాయగూరల అలంకరణ



ధ్వజస్తంభానికి చేసిన అలంకరణ



మణికంఠేశ్వరాలయానికి సారె తెస్తున్న ఎమ్మెల్యే, ఈవో, నేతలు

ఐరాల(కాణిపాకం), జూలై 21: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో కూరగాయలతో వివిధ రకాల బొమ్మలను ఏర్పాటు చేశారు. మణికంఠేశ్వరస్వామి ఆలయంలో వంకాయలు, కాలీఫ్లవర్, క్యారెట్‌తో ఏర్పాటు చేసిన శివలింగాకృతి భక్తులను ఆకట్టుకుంది. టీడీపీ నేతలు గిరిధర్‌బాబు, మణినాయుడు, మధుసూదనరావు, గంగారపు హరిబాబునాయుడు, గంగారపు గోపి, హేమాద్రినాయుడు, పూర్ణచంద్ర, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



గుడిపాల, జూలై 21: మండలంలోని కుప్పిగానిపల్లె పంచాయతీ కండిగ గ్రామంలో మునీశ్వరునికి ఆదివారం మహాకుంభాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 190 రామాపురం, కుప్పిగానిపల్లి, కండిగ, తమిళనాడు రాష్ట్రం కాట్పాడి వాస్తవ్యులు అన్నదానం చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు, గ్రామపెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

బాల వికాస కేంద్రాల ప్రారంభం

వెదురుకుప్పం, జూలై 21: గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం వెదురుకుప్పం మండలంలో పలుచోట్ల బాల వికాస కేంద్రాలను ప్రారంభించినట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సంయోజక్ ఎస్.చిన్నస్వామిరెడ్డి, జిల్లా మహిళా సంయోజకురాలు జమునమ్మ, సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. చింతలగుంట కాలనీ, నక్కలాంపల్లి కాలనీలో ప్రారంభించామని చెప్పారు. మండల సంయోజకులు గోవిందయ్య పాల్గొన్నారు.

రాజవేలు మృతి పార్టీకి తీరని లోటు

గుడిపాల, జూలై 21: టీడీపీ మండల కార్యదర్శి కిట్టు తండ్రి, సీనియర్ నాయకుడు రాజవేలు అనారోగ్యంతో మృతిచెందడం పార్టీకి తీరని లోటని జీజేఎం చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు అన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ



నగరి, జూలై21: స్థానిక లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఆదివారం వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. నగరి బస్టాండ్ కూడలిలో, ప్రభుత్వాస్పత్రి, కొండచుట్టు మండపం వద్ద రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వారికి అందజేశారు. క్లబ్ పట్టణాధ్యక్షురాలు రాజరాజేశ్వరి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా నిరాశ్రయులకు సేవలు అందిస్తున్నామన్నారు. క్లబ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రాజు, డైరెక్టర్ హరిప్రసాద్‌వర్మ, మాజీ అధ్యక్షుడు మోహన్, సభ్యులు రామ్మోహన్, మహమ్మద్‌షఫీ, దేవన్, పొన్నురంగం పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



బంగారుపాళ్యం, జూలై 21: మండలంలోని మొగిలిమిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం 24 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. గురుపూజోత్సవం నిర్వహించి, అప్పటి గురువులు, విశ్రాంత ఉపవిద్యాశాఖ అధికారి నాగరాజన్, ఉపాధ్యాయులు మునిరత్నం, చంద్రశేఖర్, సుజాతలను సన్మానించారు. గత మధురానుభూతులను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు







చిత్తూరు కట్టమంచి సాయిబాబా ఆలయంలో పూజలు - తవణంపల్లె మండలం అర్ధగిరిలో సుదర్శన హోమం - విజయపురం మండలం ఇళ్లత్తూరులో పూజలు



నగరిలో సాయిబాబాకు పాలాభిషేకం

చిత్తూరు కల్చరల్, జూలై 21: నగరంలోని సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కట్టమంచి విశ్వసాయి ఆలయంలో ఆలయ ట్రస్టీ సీకే లావణ్యబాబు ఆధ్వర్యంలో స్వామికి కాగడ, సంధ్యా, సేజ్ హారతులు, పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. విశేషాలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. సత్యనారాయణవ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ముత్తిరేవుల సాయి ఆలయంలో బాబాకు పంచామృతాభిషేకం చేయించారు. కుమ్మర వీధి, జీకే నగర్‌లోని ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, సత్యనారాయణవ్రతం నిర్వహించారు.

పాలసముద్రం : రాచపాళ్యం బాలగురునాదీశ్వరాలయంలో కలశాలు ఏర్పాటు చేసి, హోమం నిర్వహించారు. మూలవిరాట్‌కు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

తవణంపల్లె : అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అన్నదానం చేశారు.

విజయపురం : మండలంలోని జగన్నాథపురం శ్రీ రామనామ క్షేత్రంలో రాంప్రసాద్‌శర్మ, విజయపురం, కొత్త ఇళ్లత్తూరులో వీరబ్రహ్మస్వామి ఆలయంలో పురోహితులు వందవాసి మహేష్‌శర్మ హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. రాత్రి హరికథా కాలక్షేపం నిర్వహించారు. ఎల్లసముద్రంలో చెల్లాతమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కు తీర్చుకున్నారు. మంగళం పొన్నియమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పెట్టారు.

నగరి : పట్టణ పరిధిలోని బేరివీధి సాయిరాం మందిరంలో కాగడా హారతితో బాబాకు మేల్కొలుపు సేవ నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి భక్తులు పాలాభిషేకం చేశారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి, సాయిసత్యవ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

గుడిపాల : మండలంలోని క్రిష్ణజిమ్మాపురం సాయిబాబా ఆలయంలో నిర్వాహకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.